క్లుప్తంగా

ఇంటి స్థలంపై టీడీపీ నాయకుల కన్ను



కోనాపురంలో హడావుడి చేస్తున్న అధికారులు

గుమ్మఘట్ట: నిరుపేదలకు అందించిన ఇంటి స్థలాలపై టీడీపీ నాయకుల కన్నుపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఉప్పర రామాంజనేయులు భార్య చంద్రమ్మకు సర్వే నంబర్ 381ఏ1లో 2011లో రెండున్నర సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో ఆ స్థలంలో పునాదులు వేసి, స్థోమత లేక ఇంటిని నిర్మించుకోలేకపోయారు. రామాంజనేయులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో ఆ స్థలంలో సీసీ రోడ్డు నిర్మించాలని టీడీపీ నాయకులు కుట్ర చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులను ఉసిగొల్పి, మంగళవారం నానా హంగామా చేశారు. స్థానిక మహిళలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా వారి నుంచి పోలీసులు ఫోన్ లాక్కుని హడావుడి చేశారు. స్థలం విషయంపై కోర్టుకు వెళ్లామని బాధితులు చెప్తున్నా వారు పట్టించుకోలేదు.

రీ సర్వే పూర్తి చేయాలి

శెట్టూరు: రీ సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు సూచించారు. మంగళవారం శెట్టూరు మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామంలో రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. రీసర్వే పనులలో అధికారులకు రైతులు సహకరించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ సుబ్రమణ్యం, రీసర్వే అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి తొలి సమావేశం జరిగింది. హెచ్‌డీఎస్ కమిటీ నూతన సభ్యులుగా సురేష్‌కుమార్, కళ్యాణ్, శ్రీనివాసులు, సంపత్‌కుమారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మెర్సీ జ్ఞాన సుధ, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్థాయిలో జనవరి 5,6వ తేదీల్లో విజయవాడ సమీపంలోని మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చరణ్ తేజ, మోహిత్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బాల్య వివాహాలను అరికడదాం

కుందుర్పి: బాల్య వివాహాలను అరికట్టి, ఆడబిడ్డలను కాపాడుకుందామని ఎంఈఓ తిప్పేస్వామి అన్నారు. నిజవల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బాల్య వివాహాలపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి హాజరై మాట్లాడారు. హెచ్ఎం సుధాకుమార్‌రావు, హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న, వైద్య సిబ్బంది లైలా, మహిళా పోలీస స్వప్న పాల్గొన్నారు.

భగవాన్‌దాస్ సేవలు మరువలేనివి



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: భగవాన్‌దాస్ సేవలు మరువలేనివని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో పీహెచ్‌సీలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన భగవాన్‌దాస్, ఆశా కార్యకర్త రత్నమ్మకు సన్మానించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ మాట్లాడుతూ భగవాన్ దాస్ క్రమశిక్షణ, వృత్తిపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు.

అగ్నిప్రమాదంలో ఉలవ పంట దగ్ధం

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలోని కృష్ణ లేఅవుట్‌లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఉలవ పంట దగ్ధమైంది. ప్రమాదంలో పంట నూర్పిడికి ఉంచిన దాదాపు 10 ట్రాక్టర్ల ఉలవపొట్టు పూర్తిగా కాలిపోయింది. ఉడేగోళం రైతు గురు సిద్దప్ప దాదాపు 20 ట్రాక్టర్ల ఉలవ పంటను ఆరబెట్టి పంట నూర్పిడి కోసం కృష్ణ లేఅవుట్‌లో ఉంచాడు. ఉన్నపళంగా 20 కుప్పల ఉలవ పంటకు నిప్పంటుకుని, మంటలు వ్యాపించి కాలిపోయింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పి నష్టాన్ని నివారించారు. పది ట్రాక్టర్ల మేర ఉలువ పంట కాలిపోవడంతో దాదాపు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు గురు సిద్దప్ప వాపోయాడు. ఈ ఘటనపై అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసుకున్నారు.

కన్నీటి తడి..

- బోరుబావి, సోలార్ సెట్, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసిన దుండగులు
- ఎండుతున్న చీనీ మొక్కలు
- ఆదుకోవాలని అధికారులకు బాధితుడి వేడుకోలు





చీనీ మొక్కలకు బిందెలతో నీరు పోస్తున్న రైతు రాము

బెళుగుప్ప: వ్యవసాయమే ఆధారంగా జీవించే రైతన్న ఆరుగాలం కష్టించి పంటలు, పండ్లతోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పంటకు నీరందకపోయినా, తెగుళ్ల సోకినా, రోగాలొచ్చినా తల్లడిల్లిపోతాడు. పంటలు పచ్చగా కళకళలాడుతుంటే మురిసిపోతాడు. అయితే బెళుగుప్పకు చెందిన రైతు రాముకు కన్నీటి కష్టమొచ్చింది. దుండగులు బోరుబావి, సోలార్ ప్లేట్లు, మోటార్‌ను ధ్వంసం చేయడంతో చీనీ మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో బిందెలతో నీరుపోస్తూ మొక్కలు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. బెళుగుప్ప మండల కేంద్రానికి చెందిన రైతు రాము తనకున్న మూడు ఎకరాల్లో రెండేళ్ల క్రితం డ్రైలాండ్ హార్టికల్చర్ కింద 350 చీనీ మొక్కలు నాటాడు. ప్రస్తుతం రెండేళ్ల వయస్సులో నాలుగు అడుగుల పైగా చీనీ మొక్కలు పెరిగాయి. తోటలో ఉన్న బోరుబావికి సోలార్ ఏర్పాటు చేసి, నీరందిస్తున్నాడు. మొక్కలు పచ్చగా ఏపుగా పెరుగుతున్నాయనుకున్న తరుణంలో బోరుబావికి అమర్చిన సోలార్ ప్లేట్లను, స్టార్టర్ బాక్స్‌ను, నీటి సరఫరా చేసే డ్రిప్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో చీనీ మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే పలు మార్లు రిపేరీ చేయించుకున్నా తిరిగి ధ్వంసం చేస్తుండడంతో చేసేది లేక నిస్సహాయి స్థితిలో ఉండిపోయాడు. ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద బిల్లులు కూడా సక్రమంగా అందలేదు. దీంతో సమస్య మరింత జఠిలమైంది. ఎండుతున్న చీనీ మొక్కలకు బిందెలతో నీటిని పోస్తూ కొంత రక్షించే ప్రయత్నం చేస్తూ మండల పరిషత్ ఎంపీడీఓ, మండల తహసీల్దార్‌కు రక్షక తడులకోసం సహాయం అందించాలని విన్నవించాడు.

ఇలాంటి ఘటనలు మరిన్ని..

కోనంపల్లి, నక్కలపల్లి, బెళుగుప్ప, బెళుగుప్ప తండా, ఆవులెన్న, ఎర్రగుడి, జీడిపల్లి తదితర గ్రామాల్లో బోరుబావి స్టార్టర్‌లు, మోటార్ కేబుల్ వైర్లను, డ్రిప్ పరికరాలను దొంగలించిన ఘటనలు ఉన్నాయి. డ్రిప్ పైపులు, మోటార్‌లను సైతం ఎత్తుకెళ్లడంతో తాము నష్టపోతున్నామని పలు గ్రామాలకు చెందిన రైతులు చెప్తున్నారు.



బోరుబావి ధ్వంసం చేశారు..

తనకున్న మూడు ఎకరాల్లో చీనీ మొక్కలను సోలార్ సిస్టం కింద బోరుబావితో రెండేళ్ల క్రితం సాగు చేశా. ప్రస్తుతం చీనిలో అంతర పంటలుగా కంది, జొన్న పంటలు ఉన్నాయి. అయితే గుర్తు తెలియని వారు బోరు బావిని, సోలార్‌ను పూర్తిగా ధ్వంసం చేసి, స్టార్టర్‌లో పరికరాలు ఎత్తుకెళ్లడంతో పంట ఎండిపోతోంది. రక్షక తడులతో చీనీ పంటను రక్షించాలని మండల అధికారులకు విన్నవించా.

– రాము, బెళుగుప్ప గ్రామం, మండలం



బిల్లులు అప్‌లోడ్ చేశాం

డ్రైలాండ్ కింద సాగు చేసిన పంటలకు మొదటి ఏడాది నీటి తడుల బిల్లులు, రక్షణ బిల్లులు చెల్లించాం. రెండు, మూడో ఏడాది కేవలం రక్షణ, ఎరువుల బిల్లులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం డ్రైలాండ్ హార్టికల్చర్ కింద సాగు చేసిన పంటలకు రక్షణ, ఎరువుల యాజమాన్యం బిల్లులన్నింటినీ అప్‌లోడ్ చేసాం. త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో మునుపటిలా జమ అవుతాయి.

– సూర్యప్రకాశ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ బెళుగుప్ప మండలం

కుడి కాలువకు కొనసాగుతున్న నీటి సరఫరా

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నుంచి ధర్మవరం కుడి కాలువకు నీరు సాగుతోంది. 2024 డిసెంబర్ 2న ధర్మవరం కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులను నీటితో నింపడానికి అధికారులు కుడి కాలువకు నీరు విడుదల చేశారు. రోజుకు 700 క్యూసెక్కులు చెప్పున నీరు సరఫరా చేస్తూ వస్తున్నారు. ఈ నెలాఖరుకు అన్ని చెరువులు నీటితో నిండే అవకాశం ఉంది.

మెగా వైద్య శిబిరానికి స్పందన



బూదగవి గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన బూదగవి సూర్యదేవాలయంలో రథసప్తమి సందర్భంగా జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తుల కోసం హరీష్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరాన్ని యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బీసాతి భరత్, ఆలయ కమిటీ సభ్యులు చిరంజీవి ప్రారంభించారు. అనంతపురానికి చెందిన సన్‌రే ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించి, వైద్యపరీక్షలు చేశారు. సన్‌రే ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ రోహిత్ రెడ్డి, డాక్టర్లు స్రవంతి, నివేదిత, జీపీ సంధ్య, గణేష్‌రెడ్డి, సురేంద్రబాబు, అరవింద్ కుమార్‌రెడ్డి వైద్యసేవలు అందించారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటేష్ నాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలం ఉదిరిపికొండ తండాకు చెందిన వైఎస్సార్ సీపీ నేత వెంకటేష్ నాయక్ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మంగళవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి వెంకటేష్ నాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం ఏవిధంగా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నేతలు రమేష్ నాయక్, రామ్మోహన్, ఛత్రేనాయక్, నరేష్, శ్రీనివాసులు, నాగేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

శుభకార్యం

వజ్రకరూరు: మండలంలోని గంజికుంటలో శారద, హరినాథరెడ్డి దంపతుల కుమార్తె శివజ్యోతి, కర్నూలు జిల్లాకు చెందిన ఈరమ్మ లక్ష్మిరెడ్డి దంపతుల కుమారుడు వీరశేఖర్‌రెడ్డి వివాహ రిసెప్షన్ మంగళవారం జరిగింది. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలం మాల్యంలో సుంకులమ్మదేవి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి మడుగుతేరు లాగారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి నామాన్ని స్మరిస్తూ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి మెయిన్‌బజారు వరకు భక్తులు రథాన్ని లాగారు. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఉదయం జరిగిన మడుగుతేరు వేడుకల్లో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, నాయకులు కోళకుర్తి జయరామిరెడ్డి, ఆర్కే బద్రీ, మద్రేగౌడ్, తిప్పారెడ్డి కుంబరి చంద్ర, గిరి, ఇమాంవలీ, కరిబసి, హళ్లినాగరాజు, ప్రకాష్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, పాటిల్ భరత్, చిన్నసర్మస్, వేమన, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, యర్రగుంట హనుమంతప్ప పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ల నిరసన

రాయదుర్గంటౌన్: విదేశీ బీమా కంపెనీలతో దేశభద్రత, ప్రజల గోప్యతకు ముప్పు తప్పదని, బీమా రంగంలో ఎఫ్‌డీఐ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం రాయదుర్గంశాఖ కార్యదర్శి కృష్ణభూషణ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి వంద శాతానికి పెంచడం తగదన్నారు. ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లల సామర్థ్యానికి అనుగుణంగా విద్యాబోధన

కూడేరు: పిల్లల సామర్థ్యానికి అనుగుణంగా సులభ పద్ధతిలో విద్యా బోధన చేస్తే విద్యావంతులుగా తయారవుతారని టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. టీచ్ టూల్ కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో టీచర్లు బోధిస్తున్న తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులను పిల్లల మధ్యన కూర్చొని అరగంట పాటు పరిశీలించారు.

మార్మోగిన లక్ష్మీ నారసింహ నామస్మరణ



భూదేవి, శ్రీదేవి సహిత లక్ష్మీనృసింహుడి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



మార్కండేయస్వామి ఆలయంలో భావనారుషి భద్రావతి అమ్మవారి కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

ఉరవకొండ: నమో నారసింహ అన్న నామస్మరణతో పెన్నహోబిలం ఆలయ ప్రాంగణం మార్మోగింది. మంగళవారం ఉదయం రథసప్తమి పర్వదినం సందర్భంగా స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనృసింహుడిని భూదేవి,శ్రీదేవి సమేతంగా గరుడ, గోవాహనం, హనమంతవాహనంతో పాటు సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి, ఆలయ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం అభిజిత్ లగ్నం నందు శ్రీవారి కళ్యాణోత్సవం వేడుకలు ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేతంగా శ్రీవారికి పట్టు వస్త్రాలతో అలంకరించి, వేద మంత్రోచ్ఛారణ మధ్య కళ్యాణోత్సవం కనుల పండువగా సాగింది.

వైభవంగా రథసప్తమి వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం వద్ద నుంచి పట్టణంలోని వినాయక సర్కిల్ వరకు ఊరేగించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా భావనారుషి,భద్రావతి కళ్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో మంగళవారం భావనారుషి స్వామి, భద్రావతి అమ్మవారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గంగపూజ, స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలో భావనారుషి, భద్రావతి అమ్మవారి చిత్రపటాలను ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి బళ్లారి రోడ్డు, ఓబుళాచారి రోడ్డు, బొడ్డురాయి మీదుగా తిరిగి ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. కళ్యాణోత్సవానికి భక్తులు, దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: పూలకుంట, రంగసముద్రంలో ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి వేకువజామున సుప్రభాత సేవ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి మూలవిరాట్‌ను రథంలో కొలువుదీర్చి, వీధులలో ఊరేగించారు.

మాజీ సర్పంచ్‌కు ఉమా నివాళి



మృతదేహానికి పూలమాల వేసి నివాళ అర్పిస్తున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణమూర్తి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కృష్ణమూర్తి మృతదేహానికి వైఎస్సార్‌సీపీనేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు పూలమావేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దొడగట్ట నారాయణ, బసవరాజు గోవిందప్ప, బుసప్ప, వెంకటేశులు, నరసప్ప, రవి, రాజు, తమ్మన్న, గంగప్ప, ఎర్రిస్వామి, వెంకటేశులు, పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా



మాట్లాడుతున్న ఎంపీపీ రమావత్‌దేవి

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ రమావత్‌దేవి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యశాఖల అధికారులు డుమ్మాకొట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, వెలు గు, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, ట్రాన్స్‌కో, ఆర్‌టీసీ, శాంతిభద్రతలు, అటవీ అధికారులు, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల శాఖ అధికారులు డుమ్మాకొట్టారు. అధికారులు గైర్హాజరుకావడంపై సర్పంచులు,ఎంపీటీసీలు మండిపడ్డారు. ఎంపీపీ రమావత్‌దేవి స్పందించి సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ రవిప్రసాద్‌కు సూచించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించలేదన్నారు. చాబాల సర్పంచు మల్లెల జగదీష్, వెంకటాంపల్లి సర్పంచు కమలారెడ్డి, ఎంపీటీసీలు మునయ్య, రామకృష్ణ, ఈశ్వరమ్మ, తదితరులు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి సమావేశంలో తీర్మానం చేస్తున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. వైస్ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్‌పీ కార్యకర్తల సమావేశం

రాయదుర్గంటౌన్: స్థానిక ఏపీఎన్జీవో భవనంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగ రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా మన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి వాసవీ మాత విగ్రహ ప్రతిష్ట

బొమ్మనహళ్: గోవిందవాడలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట ప్రారంభమైనట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దు మల్లికార్జున, ఆర్వేటి లేపాక్షి శెట్టి తెలిపారు. బుధవారం గంగపూజ, మహాగణపతి పూజ, పుణ్యాహవాచ రక్షబంధనం, మహాసంకల్పం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

బెల్టు షాపులపై దాడులు



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

కంబదూరు: మండలంలోని రాళ్ల అనంతపురంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న హరిజన నాగరాజు, బోయ అక్కమ్మను అరెస్టు చేసి, వారి నుంచి 96 బాటిళ్ల ఆంధ్ర మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు.

- శెట్టూరు మండలం తిప్పన పల్లి గ్రామానికి చెందిన చిట్టెమ్మను అరెస్టు చేసి, ఆమె నుంచి 110 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ లు హరికృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు

రాయదుర్గంటౌన్: విద్యాసంవత్సరం ప్రారంభంలో అందాల్సిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు ఎట్టకేలకు ఎమ్మార్సీకి మంగళవారం చేరాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యాసంవత్సరంలో అందాల్సిన డిక్షనరీలు ఎమ్మార్సీకి చేరగా, వాటిని పాఠశాలల వారీగా ఇవ్వనున్నట్లు ఎంఈఓ వెంకటరమేష్ తెలిపారు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 27 స్కూళ్లలో 17 హైస్కూళ్లు, 10 యూపీ స్కూళ్లు ఉండగా 1,634 మంది 6వ తరగతి విద్యార్థులు చదువుతున్నట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

విషతుల్యమైన జొన్నసొప్ప తిని కాడెద్దులు మృతి

కుందుర్పి: మండలంలోని గురువేపల్లికి చెందిన రైతు సన్నప్పకు చెందిన కాడెద్దులు విషతుల్యమైన జొన్నసొప్ప తిని మృతిచెందాయి. రైతు సన్నప్ప మంగళవారం ఉదయం మొక్కజొన్న పంటకు పచ్చపురుగు మందు పిచికారీ చేశాడు. కాడెద్దులు జొన్నసొప్పను తిన్నాయి. అరగంటలోనే కాడెద్దులు మృతిచెందాయి. సుమారు రూ.1.50 లక్ష నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోయాడు.

'లక్షల డప్పులు..వేల గొంతుకలు' పోస్టర్ల విడుదల

ఉరవకొండ: మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈనెల 7న సికింద్రాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న లక్షల డప్పులు..వేల గొంతుకలు పోస్టర్లను ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో దళిత సంఘం నేతలు, ఉద్యోగ సంఘం నేతలు మంగళవారం ఆవిష్కరించారు. దళిత ఉద్యోగ సంఘం నేతలు సింగాడి దుర్గాప్రసాద్, భాస్కర్, దళిత సంఘం నేతలు రమేష్‌బాబు, బెంజిమెన్, కెంగూరి ఎర్రిస్వామి, యల్లప్ప, సురేష్‌లు మాట్లాడారు.

వజ్రకరూరు: మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న చేపట్టిన చలో హైదరాబాద్ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు బెంజ్‌మెన్, సురేష్, సుధీర్, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని యాటకల్లు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. కళ్యాణదుర్గం నుంచి బొబ్బర్లపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. శెట్టూరు నుంచి యాటకల్లుకు వెళ్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రభు, తేజ్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



కుందుర్పిలో రాతి దూలం లాగుతున్న వృషభాలు

కుందుర్పి: మండల కేంద్రంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు 12 జతల ఎద్దులు పాల్గొనగా, తోపుదుర్తి చెన్నప్పకు చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. రూ.30 వేలు, బళ్లారి ఆనంద్ రెడ్డి ఎద్దులు రెండో స్థానంలో రూ.20 వేలు, గోళ్ల వెంకటేశులు ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ. 10 వేలు బహుమతులు సాధించాయి. విజేతలకు ఆలయ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరీ తదితరులు బహుమతులు అందజేశారు.

ఫోన్‌కాల్‌తో రూ.10 వేలు టోకరా

బెళుగుప్ప: శ్రీరంగాపురానికి చెందిన రైతు పురుషోత్తంకు సైబర్ నేరగాడు టోకరా వేశాడు. వివరాలు.. మంగళవారం పురుషోత్తం తన పొలంలో ఉండగా సెల్: 9100493361 నుంచి కాల్ వచ్చింది. తాను భార్గవ్‌ను హైదరాబాద్‌లో యాక్సిడెంట్ అయ్యింది. ప్రస్తుతం యశోదా ఆస్పత్రిలో ఉన్నాను. అర్జెంట్‌గా 8864054661కు ఫోన్ చేసి రూ.30 వేలు పంపాలని తెలిపాడు. ప్రమాదమని భావించిన రైతు.. తన ఖాతాలో రూ.10 వేలు మాత్రమే ఉన్నాయని ఫోన్‌పే ద్వారా పంపాడు. కొద్దిసేపటికే అనుమానం వచ్చి అదే నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేశాడు.